

ప్రశాంతంగా డిఎస్‌సి పరీక్షలు

ఏలూరు అర్బన్ :ఉపాధ్యాయ నియామక పరీక్షలు (మెగా డిఎస్‌సి)-2025 గురువారం ఏలూరులో ప్రశాంతంగా సాగాయి. ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 200 మందికి 191 మంది హాజరయ్యారు. తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 180 మందికి 160 మంది హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 380 మందికి 351 మంది హాజరవ్వగా 29 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం ఎలాంటి పరీక్షలూ జరగలేదు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి ఐదు గంటల వరకు సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షలకు మొత్తం ఎంతమంది 200 మందికి 190 మంది హాజరయ్యారు. పది మంది గైర్హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 173 మంది హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరయ్యారు. మొత్తం 380 మందికి 363 మంది హాజరవ్వగా 17 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలూ జరగలేదు.

కాగితాల్లోనే పరిశ్రమలు..!

పరిశ్రమల ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం కసరత్తు
2024-25లో అనుమతులు తీసుకున్న కొత్త యూనిట్లు 105
రూ. 555.94 కోట్లు పెట్టుబడులు, 2045 మందికి ఉద్యోగాలంటూ లెక్క
ఫుడ్ ఆగ్రో, రబ్బర్, పేపర్ వంటి వ్యవసాయాధారిత పరిశ్రమలే
ఆ పరిశ్రమలన్నీ ఎప్పటికి కార్యరూపం దాల్చేనో స్పష్టత కరువు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించింది. భూములు అందుబాటులో లేకపోవడంతో జిల్లాలో వ్యవసాయాధారిత చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతోంది. గడిచిన ఏడాది కాలంలో దీనిపై ప్రభుత్వం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇప్పటికీ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తిస్థాయిలో అడుగులు పడలేదని చెప్పొచ్చు. అధికారుల లెక్కల ప్రకారం 2024-25 కాలంలో ఏలూరు జిల్లాలో రూ.555.93 కోట్లు పెట్టుబడులు వచ్చాయని, కొత్తగా 105 యూనిట్లు రానున్నాయని, 2045 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయని చెబుతున్నారు. ప్రతిపాదనలు వచ్చిన వాటిలో ఫుడ్, ఆగ్రో, మెరైన్ ప్రొడక్ట్, గ్లాసెస్, సిరామిక్, రబ్బర్, పేపర్ వంటి యూనిట్లు ఉన్నాయి. వచ్చిన యూనిట్లు అన్నీ ప్రస్తుతం అనుమతుల దశలోనే ఉన్నాయి. పరిశ్రమల యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి పొల్యూషన్, విద్యుత్ ఇతర అనుమతులను మంజూరు చేస్తున్నారు. అనుమతులు పొందుతున్న యూనిట్లన్నీ నిర్మాణం జరిగి కార్యరూపం దాల్చేందుకు సమయం పడుతుందని చెప్పుకొస్తున్నారు. దీంతో ఏడాది పాలనలో అభివృద్ధి జరిగిందా అనేది చెప్పలేని పరిస్థితి నెలకొంది. పరిశ్రమలు ఏర్పాటు జరిగి, ఉత్పత్తి ప్రారంభమైనప్పుడే ఉద్యోగావకాశాలు వస్తాయి. ప్రజలకు ఉపాధి దొరికితేనే అభివృద్ధి జరిగినట్లుగా పరిగణించాల్సి ఉంటుంది. పరిశ్రమల ఏర్పాటు ప్రస్తుతం కాగితాలకే పరిమితమైనట్లుగా భావించొచ్చు.

ఏడాదిలో కూటమి అడుగులు

ఉన్న పరిశ్రమలను మూతవేసి.. కొత్త పరిశ్రమలపై ఆరాటం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 70 శాతానికిపైగా జనాభా వ్యవసాయమే జీవనాధరంగా జీవనం సాగిస్తున్నారు. గతంలోనే జిల్లాలో వ్యవసాయాధారిత చిన్నతరహా, భారీ పరిశ్రమల ఏర్పాటు జరిగింది. వేలాది మంది కార్మికులు ఉపాధి పొందేవారు. ఏలూరు, తణుకు, భీమడోలు, చాగల్లు, భీమవరం ఇలా అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. తణుకు, చాగల్లు, భీమడోలు వంటి చోట్ల భారీ సుగర్ ఫ్యాక్టరీలు ఉండేవి. వేలాది మంది పని చేసేవారు. ఆ పరిశ్రమలన్నీ మూతపడి ఎన్నో కుటుంబాలకు ఉపాధి లేకుండాపోయింది. వేంద్ర పేపర్ మిల్లు సైతం అదేదారిలో మూతపడి కార్మికులు రోడ్డున పడ్డారు. ఏలూరులో జ్యూట్‌మిల్లు మూతపడి వేలాది మంది కార్మికులు రోడ్డున పడిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో వరిసాగు ఎక్కువగా ఉండటంతో జిల్లా నలుమూలల పెద్దఎత్తున రైసుమిల్లులు ఉండేవి. ఇప్పుడు చాలావరకూ మూతపడిన పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లాలో రైతులు వేలాది ఎకరాల్లో చెరకు పండించేవారు. దీంతో సుగర్ ఫ్యాక్టరీలు పెద్దఎత్తున ఏర్పాటయ్యాయి. ప్రభుత్వాలు చెరకు సాగును ప్రోత్సహించకపోవడంతో ఆయా పరిశ్రమలు మూతపడ్డాయి. వేంద్ర పేపర్ మిల్లు సైతం వ్యవసాయాధారిత పరిశ్రమగానే నడిచేది. భీమడోలులో సుద్ద ఎక్కువగా లభించడంతో పింగాణి వస్తువులు తయారయ్యే యూనిట్లు ఉండేవి. అవి ప్రస్తుతం లేకుండాపోయాయి. జిల్లాకు తలమానికంగా కొనసాగిన పరిశ్రమలను ప్రభుత్వాలు చిదిమేశాయి. ప్రస్తుతం స్పిన్నింగ్ మిల్లులు పరిస్థితి సైతం దారుణంగా మారింది. ఉన్న పరిశ్రమలను కాపాడకుండా.. కొత్త పరిశ్రమల కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంపై ప్రజల్లో చర్చ సాగుతోంది. కొత్త పరిశ్రమలు ఏర్పాటై ఉపాధి అవకాశాలు ఎప్పటికి మెరుగుపడతాయో వేచిచూడాలి.

ఉపాధ్యాయ బదిలీల్లో పాట్లు

కనీస వసతులు ఏర్పాటు చేయని విద్యాశాఖ
కూర్చునేందుకు కుర్చీలు కూడా లేని దుస్థితి
పడిగాపులతోనే సమయమంతా సరి


కూర్చోనేందుకు చోటులేక నేలమీద కూర్చున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయుల పాట్లు వర్ణనాతీతంగా మారాయి. సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కాకుండా మాన్యువల్ బదిలీలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో బుధవారం నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. తొలిరోజు బుధవారం మున్సిపాలిటీల పరిధిలోని దాదాపు 600 మందికిపైగా ఉపాధ్యాయుల బదిలీలతోపాటు, మరో వంద మంది జిల్లా, మండల పరిషత్‌కు సంబంధించిన బదిలీల ప్రక్రియ నడిచింది. గురువారం దాదాపు వెయ్యి మంది ఉపాధ్యాయులకు సంబంధించిన షెడ్యూల్ ఇచ్చారు. శుక్రవారం సైతం మరో వెయ్యి మంది వరకూ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరగనుంది. దీంతో పెద్దఎత్తున ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ సమావేశ మందిరం వద్దకు చేరుకున్నారు. బదిలీల కౌన్సెలింగ్‌కు వచ్చే ఉపాధ్యాయులకు సంబంధించి కనీస ఏర్పాట్లు కూడా విద్యాశాఖ చేయలేదు. టెంట్ వేసి కూర్చునేందుకు కుర్చీలు సైతం ఏర్పాటు చేయలేదు. బదిలీల నేపథ్యంలో అనుమానాల నివృత్తి, సూచనలు చేసేందుకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు చిన్నపాటి టెంట్‌లు వేశాయి. అంతే తప్ప విద్యాశాఖ మాత్రం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో బదిలీల కౌన్సెలింగ్‌కు వచ్చిన ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ సమావేశ మందిరం బయట నేలపైనే కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది. జెడ్‌పి ఆవరణలో ఉన్న మోటార్ బైకలపైన, గోడలపైన కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. గంటలు తరబడి వేచిచూసే ప్రక్రియ కొనసాగడంతో ఉపాధ్యాయుల్లో తీవ్ర అసహనం వ్యక్తమైంది. రాత్రిపూట సైతం బదిలీల ప్రక్రియ సాగింది. వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియ నిర్వహించేటప్పుడు విద్యాశాఖ అధికారులు కనీస ఏర్పాట్లు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం ప్రారంభం

ఏలూరులోని హైస్కూళ్లను సందర్శించిన జెసి ధాత్రిరెడ్డి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద సన్నబియ్యంతో ఆహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. గురువారం స్థానిక కెపిడిటి హైస్కూల్, గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూళ్లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. జెసి మాట్లాడుతూ జిల్లాలోని 1768 స్కూళ్లకు, 145 సంక్షేమ సంస్థలకు 17,404 బ్యాగులుగా అంటే 435.100 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సిద్ధం చేయగా ఇందులో జూన్ మాసానికి 16,261 బ్యాగులు అంటే 406.525 మెట్రిక్ టన్నులకు మూమెంట్ ఆర్డర్ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని 8 మండలస్థాయి గోదాముల ద్వారా 1768 స్కూళ్లకు 226.675 మెట్రిక్ టన్నులు (9067 బ్యాగులు), 145 సంక్షేమ సంస్థలకు 192.575 మెట్రిక్ టన్నులు (7703 బ్యాగులు) అందజేసినట్లు తెలిపారు. అక్కడ పిల్లలతో కలిసి భోజనం చేసి, భోజనం నాణ్యతను పరిశీలించి పిల్లల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అదే విధంగా ఆయా పాఠశాలలకు సరఫరా చేసిన నాణ్యమైన ఫోర్టిఫైడ్ రైస్ తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. జెసి వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి పి.శివరామ్మూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం


మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

ప్రజాశక్తి - కలిదిండి

పెట్టుబడులకు అనుగుణంగా రొయ్యలు, చేపలకు ధర లభించకపోవడంతో ఆక్వా రైతులు నష్టాలబారిన పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వా రంగం ద్వారా ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఆక్వా రైతులకు నాణ్యమైన సీడ్ అందించాలని, విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రామాల్లో రవాణాకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చిన తాడినాడ నుండి కలిదిండి, మూలలంక నుండి పెదలంక అర్అండ్‌బి రోడ్లను కనీసం గుంతలు లేకుండా మరమ్మతులు చేపట్టాలన్నారు. సిపిఎం కలిదిండి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, కార్యకర్తలు జక్కుల మహేష్, అద్దాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై జనరల్‌బాడీలో ప్రశ్నించాలి

ప్రజాప్రతినిధులకు ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ సూచన



మాట్లాడుతున్న ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తమ పరిధిలోని ప్రజా సమస్యలపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ప్రశ్నించాలని ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ విజ్ఞప్తి చేశారు. ఉంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్‌సి రవీంద్రనాథ్ మాట్లాడుతూ 27 మంది సర్పంచులకుగానూ నలుగురు మాత్రమే హాజరు కావడంపై విస్మయం వ్యక్తం చేశారు. నారాయణ పురం టూరింగుపేట పంచాయతీ ఆధీనంలో ఆర్‌ఒ తాగునీటి ప్లాంటు మూతపడి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ ఎందుకు వాడుకలోకి తీసుకురాలేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. కైకరం, ఉంగుటూరు తదితర గ్రామాల్లో మట్టి కంకర తవ్వకాలను అరికట్టడంలో అధికారుల నిర్లిప్తతను ఆయన తప్పుబట్టారు. కాకర్లమూడి ఎంపిటిసి సభ్యురాలు భర్త కోనా పోతు రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంటును నియమించాలని, పలు అవకతవకలపై అడిగినందుకు తనపై కేసులు పెడుతున్నారని, అధికారుల తీరు మారడం లేదని ఆరోపించారు. దీనిపై ఎపిఒ ఖాజావలీని ఎంఎల్‌సి వివరాలు చెప్పాలని కోరారు. దీనిపై ఎపిఒ మాట్లాడుతూ కోనా పోతురాజు న్యూసెన్స్ చేస్తున్నారని అనడంపై ఎంఎల్‌సి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు అడిగిన సమస్యలు, ప్రశ్నలకు అధికారులు, ఉద్యోగులు బాధ్యతగా సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. దీంతో ఎపిఒ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. ఉంగుటూరు ఎర్ర చెరువులో కంకర తవ్వకాలపై ఎంపిటిసి సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ ప్రశ్నించారు. జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైస్ ఎంపిపి సింగిడ్డి సూర్యనారాయణ, ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్, డిటి పోతురాజు, ఇఒపిఆర్‌డి చంద్రశేఖరం, ఎలక్ట్రికల్ ఎఇ టి.వేణు, హౌసింగ్ ఎఇ సతీష్, వెలుగు ఎపిఎం ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ఎన్నో విజయాలు

మంత్రి కొలుసు పార్థసారథి


కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించిందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం నెక్కలం గొల్లగూడెం గ్రామంలో ఎంపీ లాడ్స్ నిధులు రూ.30 లక్షలతో బిసి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి, నాబార్డు నిధులు రూ.1.50 కోట్లతో ఈదర నుండి శోభనాపురం వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని తరగతుల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతిచ్చామన్నారు. కార్యక్రమంలో నెక్కలం గొల్లగూడెం గ్రామ సర్పంచి ఎల్.రమేష్, ఎంపిటిసి జి.శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు ఎన్.వేణు, మాజీ జడ్‌పిటిసి కె.రాంబాబు, టిడిపి గ్రామాధ్యక్షులు కె.కుటుంబరావు, నేతలు ఎన్.రాంబాబు, ఎన్.రమేష్, ఎం.బాబూరావు, ఎంపిడిఒ బి.భార్గవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలని వ్యాపారుల గగ్గోలు

వర్షానికి దుకాణాల్లోకి చేరిన నీరు
సరుకు తడిచి నష్టపోతున్న వ్యాపారులు
పట్టించుకోని రోడ్డు కాంట్రాక్టర్, అధికారులు



దుకాణాల్లోకి చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ప్రధాన సెంటర్లో పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో 15 మీటర్ల పొడవునా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని ఈ రోడ్డులోని దుకాణదారులు, అద్దెదారులు సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు. ముదినేపల్లి సెంటర్లో రోడ్డు విస్తరణ పనులు ఐదు నెలలుగా జరుగుతున్నాయి. సెంటర్లో కాంట్రాక్టర్ డ్రెయినేజీ నిర్మాణ పనులు క్రమపద్ధతిలో చేయకుండా అడ్డదిడ్డంగా, ఇష్టానుసారంగా చేపట్టడంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని రెండు నెలలుగా సంబంధిత శాఖల అధికారులకు, సదరు కాంట్రాక్టర్‌కు ఈ రోడ్డులోని వ్యాపారులు మొరపెట్టుకున్నప్పటికీ ఏ మాత్రం కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. గత నెల 4వ తేదీ, ఈ నెల 11వ తేదీన కురిసిన అకాల భారీ వర్షాల కారణంగా వర్షపు నీరు తమ దుకాణాల్లో చేరి సరుకులు తడిచి, పాడై తాము ఆర్థికంగా నష్టపోతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. పంచాయతీ దారిలో రోడ్డు నిర్మాణం చేయడానికి కాంట్రాక్టర్ ఏడు అడుగులు మేర ఎత్తులో మట్టిని తోలుతున్నాడని, ఈ కారణంగా వర్షపు నీరు అంతా పల్లంగా ఉన్న తమ షాపుల్లోకి చేరుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలకు చేరిన వర్షపు నీటిని బయటికి తోడుకునే పరిస్థితి దాపురించిందని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముదినేపల్లిలో ప్రతిచోటా డ్రెయినేజీ నిర్మించిన తర్వాత రోడ్డు పనులు మొదలు పెట్టారని, తమ షాపులు ముందు మాత్రం డ్రెయినేజీ నిర్మాణం చేయకుండా రోడ్డు నిర్మించడంతో వర్షానికి షాపుల్లోకి నీరు చేరుతోందని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా వెంటనే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని, ఆ తర్వాతే రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టాలని సంబంధిత శాఖాధికారులను కోరుతున్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి

సుపరిపాలన- స్వర్ణాంధ్రప్రదేశ్ ర్యాలీలో ఆప్కాబ్ ఛైర్మన్, ఎంపీ, ఎంఎల్ఎ




ర్యాలీలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడంతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో సుపరిపాలన-స్వర్ణాంధ్రప్రదేశ్ ర్యాలీని భీమడోలులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత సంతపేటలోని వంగవీటి రంగా, అంబేద్కర్, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ర్యాలీ అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో కేక్ కోశారు. కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై, రానున్న కాలంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి


వెంకటసురేష్ (ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పాఠశాలలు పున:ప్రారంభమైన మొదటి రోజు గురువారం ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన పెదవేగి మండలంలోని కూచింపూడిలో చోటు చేసుకుంది. ఏలూరుకు చెందిన మేడూరి వెంకటసురేష్ (47) పెదవేగి మండలం కూచింపూడి జిల్లా పరిషత్ హైస్కూలులో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పాఠశాలలు పున:ప్రారంభమవ్వగా మధ్యాహ్నం సమయంలో ఆయన పాఠశాలలో పనిచేసే ఉపాధ్యా యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం జరుగుతున్న సమయంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలారు. వెంటనే ఆయనను ఉపాధ్యాయులు పెదవేగి పిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు నగరంలోని ఒక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వెంకట సురేష్ అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేడు విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

ఛైర్మన్ రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని బ్యాంక్ స్ట్రీట్‌లో ఉన్న గ్యాస్ కంపెనీ కార్యాలయం ఎదురుగా ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. ప్రారంభం కావాల్సిన బ్యాంకు ఆవరణలో ఆయన గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో రూ.వంద కోట్ల కార్యకలాపాలు నిర్వహించే లక్ష్యంతో తాము పని చేయనున్నట్లు తెలిపారు. సమీపంలోని కృష్ణాజిల్లా గన్నవరంలో తమ బ్రాంచి ఉన్నప్పటికీ నూజివీడు నుంచి ఎందరో ఖాతాదారులకు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. అతి స్వల్ప వడ్డీకి రుణాలను అందించి చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసా, హార్దిక చేయూత అందించే దిశగా అడుగులు వేయనున్నట్లు తెలిపారు. నూజివీడు పట్టణంలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌ను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్‌లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ ప్రారంభోత్సవ సభకు తమ బ్యాంకు పూర్వపు ఛైర్మన్ మానం ఆంజనేయులు, హైదరాబాదులోని ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ పిఆర్‌విపిఎస్.రంగరాజు, విజయ మిల్క్ డైరీ విజయవాడ ఛైర్మన్ ఆంజనేయులు, ఎపి ఫెడరేషన్ వైస్ ఛైర్మన్, గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ జిలాని, డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ ఆరిమిల్లి శ్రీనివాస్, తణుకు వాణి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్, ఎపి ఫెడరేషన్ డైరెక్టర్, టాఫ్ కబ్ ఎపి మెంబర్ ఎం.వెంకటరత్నం, విజయవాడ గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్ వేమూరి వెంకటరావు, ఏలూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్ అంబికా ప్రసాద్, విజయవాడ డి స్వశక్తి మార్కంటైల్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్ జివి.రామారావు, విజయవాడ శారదాంబ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ సిస్టల కుసుమ లావణ్యదేవి తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. బ్యాంకు ప్రారంభం అనంతరం పట్టణంలోని టిటిడి కల్యాణ మండపంలో ప్రారంభోత్సవ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తమ బ్యాంకు 110 వసంతాలను జరుపుకుంటూ నూజివీడులో 56వ బ్రాంచిగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

నూజివీడు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అనూష
వట్టిగుడిపాడులో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న అనూష

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నూజివీడు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అనూష అన్నారు. మండల పరిధిలోని వట్టిగుడిపాడు మోహన్ స్పిన్‌టెక్స్ ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం సాయంత్రం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ ఆర్టికల్ 24 రాజ్యాంగం బాల కార్మిక వ్యవస్థను నిరోధించాలని తెలియజేస్తుందన్నారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనికి పంపించటం చట్ట ప్రకారం నేరమని, సెక్షన్-3 ప్రకారం శిక్ష విధిస్తారని తెలిపారు. న్యాయవాది బసవరాజు రామకృష్ణ మోటార్ వాహనాల చట్టాలు, కార్మికుల హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ అధికారి కె.శ్యాంబాబు, న్యాయవాదులు ఎస్‌కెడి.ప్రసాద్‌రావు, మురాళ్ల గోపీనాథ్, మోహన్ స్పిన్‌టెక్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ పాల్గొన్నారు.


ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజల నుంచి అర్జీల రూపంలో వచ్చే సమస్యల పరిష్కారాన్ని తొలి ప్రాధాన్యతగా నిర్దేశించుకుని, అందుకు తగిన విధంగా ప్రణాళికతో పని చేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ఏలూరు శాంతినగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీకి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు వినతుల రూపంలో తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను 70 శాతం పైగా పరిష్కరిస్తున్నామని, మిగిలిన సమస్యలు భూ వివాదాలకు సంబంధించిన అంశాలు కావడంతో జాప్యం జరుగుతుందని తెలిపారు. అనంతరం పార్లమెంటు పరిధిలోని పామాయిల్ రైతులు ఎంపీ మహేష్ కుమార్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. పామాయిల్ రైతులకు సంబంధించి గిట్టుబాటు ధర కల్పించే అంశాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే పరిష్కారం లభిస్తుందని రైతులకు ఎంపీ భరోసా ఇచ్చారు.

సహాయ మాత స్కూల్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - ముదినేపల్లి


అవార్డు అందుకుంటున్న విద్యార్థి

రాష్ట్ర ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరానికి ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డులను ముదినేపల్లికి చెందిన సహాయ మాత హైస్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఇటీవల ఏలూరులో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఈ అవార్డులను విద్యార్థులు అందుకున్నారు. స్థానిక సహాయ మాత స్కూల్ విద్యార్థులు ముక్కు జాహ్నవి, కొడాలి జగదీష్ షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నారు. అవార్డులతో పాటుగా రూ.20 వేల నగదు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ అవార్డులు అందుకున్న స్కూలు విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపల్ లిన్సా, కరెస్పాండెంట్ సిస్టర్ క్రిష్టి, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కె.రమేష్‌బాబుకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రంశెట్టి నాగేంద్రం, సిపిఎం మండల కార్యదర్శి బయ్యన శ్రీను, మేడిపల్లి బాబు, పట్ల లక్ష్మయ్య, ఎస్‌కె.వలీపాషా, రమేష్, కోట మోహన్‌రావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా భారతి

ప్రజాశక్తి - భీమడోలు

పోలసానిపల్లి బాలయోగి గురుకులం (బాలికల) పాఠశాల ప్రిన్సిపల్‌గా నంబూరి భారతి ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. జంగారెడ్డిగూడెం ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న భారతి సాధారణ బదిలీల్లో భాగంగా పోలసానిపల్లి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన వివి.రమణ నుంచి బాధ్యతలను స్వీకరించారు. అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, పోలసానిపల్లి సర్పంచి షేక్ రహీమా బేగం హుసేనలను వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు.

పుస్తకాలు అధిక ధరలకు అమ్ముతున్న విద్యాసంస్థ

ఎంఇఒకు సమాచారం ఇచ్చిన ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థల్లో రూ.వందకు దొరికే పుస్తకాన్ని రూ.300లకు అమ్ముతున్నారని, ఇక్కడే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో నారాయణ విద్యాసంస్థలు పుస్తకాలు అమ్ముతుంటే వాటిని ఆపి స్థానిక ఎంఇఒకు సమాచారం ఇచ్చి పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేసినట్లు తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థల శక్తులకు ప్రభుత్వ విద్యాశాఖాధికారులు కొమ్ము కాస్తున్నారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ స్పందించి ఇటువంటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం అభివృద్ధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పచ్చిరొట్ట సాగు విధానంతో వ్యవసాయ భూములు సారవంతంగా మారి మంచి పోషక విలువలను పొందుతాయని వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు చాముండేశ్వరి తెలిపారు. చాముండేశ్వరి నూజివీడులో గురువారం మాట్లాడుతూ రైతాంగానికి ఎకరాకు పది కేజీలు జీలుగు, పది కేజీల జనుము, ఎనిమిది కేజీల పిల్లి పెసర విత్తనాలు అందించినట్లు తెలిపారు. ఈ పచ్చి రొట్ట విత్తనాలు సాగు చేసే రైతులు 45 రోజులు గడిచిన తర్వాత పోతదశకు రాగానే పంట భూమిలో కలియ దున్నాలని సూచించారు. సరైన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందాలని చెప్పారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో గురువారం బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని మీర్జాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా వారి కుటుంబానికి రూ.పది లక్షల చెక్కును రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి గురువారం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుని జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సామాన్యుని జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అత్యంత సమర్థవంతంగా సాగిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది పూర్తైన సందర్భంగా గురువారం ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ బడేటి చంటి అధ్యక్షతన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత టిడిపి వ్యవస్థాపకులు, మాజీ సిఎం, కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూటమి పాలనకు ఏడాది పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేన్సర్‌తో బాధపడుతున్న రోగుల మందుల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే ఎనిమిది మందికి చెవి వినికిడి మిషన్లను పంపిణీ చేశారు. ఇద్దరికి ట్రైసైకిళ్ళలను అందించారు. విద్యార్థులకు కూడా సాయాన్ని అందించారు. విద్యలో రాణిస్తున్న ఇద్దరు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఏడుగురు విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. బాలునికి గుండె సంబంధిత శస్త్రచికిత్సకు సంబంధించి రూ.3.50 లక్షల ఎల్‌ఒసిని అందించారు.

చింతలపూడి చింతలపూడి పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రగడవరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరు చంద్రశేఖర్ రెడ్డి, కనుమత రెడ్డి రాజా, చిలుకూరి సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : సుపరిపాలనకు ఏడాది పూర్తయినట్లు ఎంపిడిఒ జి.నగరాజకుమారి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద విజయోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఎఇ సంపత్ కుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ, మంగిన వెంకటరమణ, కుంచే దొరబాబు, ఆకుల రాజా, తెలుగు యువత అధ్యక్షులు పెద్దేహపు సత్యనారాయణ పాల్గొన్నారు.

మండవల్లి : భైరవపట్నంలోని కూటమి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎ నాయకులు సజ్జ సురేష్ (బాబి), గంగుల ఆదినారాయణ, కోనపరెడ్డి కోటేశ్వరరావు, ముళ్లపూడి సత్తిబాబు, బొల్లంపల్లి సత్యనారాయణ, శేఖర్, రాజా పాల్గొన్నారు.

ప్రయివేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యాబోధన

బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కుసుమకుమారి


కుసుమకుమారి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రయివేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యాబోధన ఉంటుందని ప్రిన్సిపల్ సంజీవని కుసుమకుమారి చెప్పారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. 2004లో ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి, సిఇసి గ్రూపులతో బుట్టాయగూడెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమైందని చెప్పారు. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల 2004 నుంచి ఇప్పటివరకు విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కళాశాలలో ఎక్కువ మంది గిరిజన విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నుంచి వచ్చి చదువుకుంటారని చెప్పారు. బాలికలకు హాస్టల్ వసతి కూడా ఉందని తెలిపారు. 2025 నుంచి నూతనంగా సిఎస్ఇ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్) గ్రూపును ప్రారంభించామని, ఈ గ్రూపు తీసుకున్న విద్యార్థులు మంచి మంచి ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుత సమాజంలో కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని గమనించి ఏజెన్సీ ప్రాంతం బుట్టాయగూడెం మండలంలో గిరిజన విద్యార్థులకు మంచి విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ఈ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. 2008లో ప్రారంభించిన ఒకేషనల్ కోర్సులు గ్రూపులు చదివిన విద్యార్థులు విజయవాడ, హైదరాబాద్, రాజమండ్రి వంటి పెద్ద పెద్ద సిటీల్లోని కార్పొరేట్ హాస్పిటల్స్‌లో, ప్రభుత్వాసుపత్రుల్లో నర్సులుగా పని చేస్తున్నారన్నారు. కొంతమంది ల్యాబ్స్ పెట్టుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారన్నారు. 2025 ఇంటర్ ఫలితాల్లో 87 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు తెలిపారు. ఒకేషనల్ కోర్సుల్లో 897 మంది అత్యధిక మార్కులు సాధించారన్నారు. ఈ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు కూడా ఉందన్నారు. కళాశాలలో చదువుకునే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, కాలేజీ బ్యాగ్స్‌ను ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు.


బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు భీమడోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-1లో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని గురువారం ప్రారంభించారు. సన్న బియ్యంతో భోజనం తయారీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులకు వడ్డన చేశారు. వారితో సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. రుచి, శుచి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్ మండలంలోని విద్యా ప్రగతి గురించి వారికి వివరించారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని జెడ్‌పి బాలికల హైస్కూల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ గురువారం పరిశీలించారు. వండిన వంటకాలను పరిశీలించి రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయనతో పాటు నూజివీడు తహశీల్దార్ బద్రు, పిడిఎస్ డిటి ఉన్నారు.

టి.నరసాపురం : టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తహశీల్దార్ టి.సాయిబాబా సందర్శించి మధ్యాహ్న భోజనంను పరిశీలించి విద్యార్థులతో కలిసి బోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిఎల్.స్వామి, ఉపాధ్యాయులు నారాయణ, కుటుంబరావు, చైతన్య, తహశీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ బి.హరిబాబు, విఆర్ఒ ఫణి పాల్గొన్నారు.

చాట్రాయి : చాట్రాయి ఎంఇఒ బ్రహ్మచారి తెలిపారు. మండలంలోని సి.గుడుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రధానోపాధ్యాయులు బక్కయ్యతో కలిసి ఎంఇఒ బ్రహ్మచారి పరిశీలించారు. ఈ సందర్భంగా వంట కార్మికులకు తగు సూచనలు చేశారు. నరసింహారావుపాలెం ఎంపిపి పాఠశాలలో, చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.

మండవల్లి : మండలంలోని అయ్యవారి రుద్రవరం ఎంపిపిఎస్ పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వం అందించిన సన్న బియ్యాన్ని పిడిఎస్ డిటి జిఎన్‌ఎం.ఏమలికుమారి పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

దెందులూరు : మండలంలోని కొవ్వలి ఉన్నత పాఠశాలలో సన్న బియ్యంతో తయారుచేసిన మధ్యాహ్నం భోజనాన్ని తహశీల్దార్ సుమతి, ఎంఇఒ అన్నమ్మ పరిశీలించారు. వంటలను రుచి చూడడంతో పాటు, విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహశీల్దార్ ప్రమాద్వర తెలిపారు. నగర పంచాయతీలోని ఎంపిపి స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఆమెతో పాటు డిప్యూటీ తహశీల్దార్, తదితరులు ఉన్నారు.

ముసునూరు : మండలంలోని 16 గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా సన్నబియ్యంతో వంట చేయనున్నట్లు ఎంఇఒ బిఇఎస్.వెంకట సుబ్బారావు తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను ఆయన పరిశీలించారు.

కొయ్యలగూడెం : ఎంఇఒ జె.సురేష్‌బాబు, తహశీల్దార్ ఎన్.నాగరాజు పలు పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భోజన నిర్వాహకులకు, ప్రధానోపాధ్యాయులకు తగిన సూచనలు చేసి, పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరభ్యాసం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని ఫస్ట్ సెక్టార్ లంకపేట-2 అంగన్వాడీ కేంద్రంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ శారదా చేతుల మీదుగా సామూహిక అక్షరాభ్యాసం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ విజయలక్ష్మి, సూపర్‌వైపర్ మంగా, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సాముహిక అక్షరాభ్యాస్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ముదినేపల్లి తహశీల్దార్‌గా లతీఫ్ భాషా

ముదినేపల్లి : ముదినేపల్లి తహశీల్దారుగా ఎస్‌కె.లతీఫ్ భాషా గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన కృష్ణాజిల్లా మచిలీపట్నం ఆర్‌డిఒ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ముదినేపల్లి తహశీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.